క్లుప్తంగా

వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


ప్రధాన పంటకాలువపై వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ఊడిమూడి శివారు చింతావారి పేట, ఉచ్చులవారి పేటల మధ్య ప్రధాన పంట కాలువపై నిర్మిస్తున్న వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం సీఎం జగన్ వశిష్ట నదీపాయపై రూ.49.5 కోట్లతో వంతెనను మంజూరు చేసిన విషయం విదితమే. ఈ ప్యాకేజీలో భాగంగా ముందుగా ప్రధాన పంట కాలువపై చేపట్టిన వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ పనులను చిట్టిబాబు సోమవారం పరిశీలించారు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు సొసైటీ చైర్మన్ గిడ్డి రాంబాబు, నాయకులు సాధనాల రమేష్, కత్తుల విక్టర్‌బాబు, పందిరి పూర్ణచంద్రరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామికి జడ్జి పూజలు


ప్రిన్సిపల్ జడ్జి సునీతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో తూర్పు గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి గంధం సునీత కుటుంబ సభ్యులు స్వామి వార్ని దర్శించుకుని పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆమెకు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటం అందజేశారు.

గడప గడపకూ నిధులతో రెండు రోడ్లకు మోక్షం


పెదపట్నం బాబానగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

మామిడికుదురు: పెదపట్నంలోని బాబానగర్ కాలనీలో రెండు రోడ్లు ఎంతో కాలం నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. ఎంతో మంది పాలకులు వచ్చిన ఈ ప్రాంత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదు. 23 ఏళ్ల నుంచి బాబానగర్ కాలనీలో అపరిష్కృతంగా ఉన్న రెండు రోడ్లకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విముక్తి కలిగింది. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో 120 మీటర్ల మేర రెండు సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ రెండు రోడ్ల నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. సుదీర్ఘ కాలం నాటి సమస్య ఎమ్మెల్యే చిట్టిబాబు చొరవతో పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన పోషణ రితిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల కోలకతాలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ సెవెన్ విభాగంలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. పదో స్థానంలో విజయం సాధించిన ఆ విద్యార్థినికి ప్రైజ్ మనీతో పాటు, బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాండ్ర నాగమోహన్‌రెడ్డి, ప్రియాంక ఫెర్టిలైజర్స్ అధినేత సత్తి సతీష్ రెడ్డి, తాడి చంద్రశేఖర్ రెడ్డి, యాళ్ల రమణయ్య, తదితరులు విద్యార్థిని రితికతో పాటు తల్లిదండ్రులు నరసింహమూర్తి, తులసి దంపతులను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ భద్రతపై అవగాహన

ఆత్రేయపురం: విద్యుత్ భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎలక్ట్రికల్ ఏఈ కె.బాబిరాజు ప్రజలకు సూచించారు. సోమవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్థానిక సబ్ స్టేషన్ నుంచి ఆత్రేయపురం గ్రామంలో తిరిగి భవన నిర్మాణ, కొబ్బరి దింపు కార్మికులు, సామాన్య ప్రజానీకానికి విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఏఈ బాబిరాజు మాట్లాడుతూ పేరవరం సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. 33 కేవీ లైను మరామ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు.


గోపాలపురంలో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


పి.గన్నవరంలో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు


మలికిపురంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

నేటి తరానికి గాంధీజీ ఆదర్శం

- ఘనంగా గాంధీ జయంతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, వరప్రసాదరావు

రావులపాలెం: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సత్యం, అహింస అనే ఆయుధాలతో పోరాటం చేసిన జాతిపిత మహాత్మాగాంధీనే నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని గోపాలపురం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్విడెక్టు పార్కులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పెంటపాటి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే చిట్టిబాబు సత్కరించారు.

మలికిపురంలో..

మలికిపురం: సీఎం జగన్ హయాంలో గాంధీ కన్న గ్రామ స్వరాజ్యం కలలు సాకారమవుతున్నాయని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మలికిపురం కూడలిలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో నాటి నాయకుల పోరాట స్ఫూర్తిని నేటి యువత తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు కేఎస్ఎన్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ రావు తదితరులు పాల్గొన్నారు.


తాటిపాక సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మామిడికుదురులో..

మామిడికుదురు: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక జాతీయ రహదారి పక్కన ఉన్న విగ్రహానికి సోమవారం ఎమ్మెల్యే చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, ఎంపీటీసీ వర్ధినేని రాము పాల్గొన్నారు. రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏడిద కవీంద్ర ఆధ్వర్యంలో మొగలికుదురు శ్రీసత్యసాయి భరోసా దీన జనోద్ధరణ కేంద్రంలో వృద్ధులు, చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు అందించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక పంచాయతీ వద్ద గాంధీ విగ్రహానికి సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గొల్లమందల చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజోలులో..

రాజోలు: గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల పరిషత్ తదితర కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజోలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు కోట సుధాకర్ తదితర న్యాయవాదులు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటిపాక సెంటరులో గాంధీజీ విగ్రహానికి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వాసవీక్లబ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆత్రేయపురం మండలంలో వాడవాడలా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు సచివాలయాల వద్ద పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఆర్యవైశ్య నాయకులు కూడా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: గాంధీ అహింసా మార్గం, అడుగుజాడలే అందరికీ మార్గదర్శకమని ఎంపీపీ మార్గన గంగాధర రావు అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి ఎంపీపీ, పలువురు ఎంపీటీసీలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, రేవాడి నాగమణి, నేలపూడి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గాంధీజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో పయనించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతిపిత గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వాసవీ వైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబాజీపేట సత్యసాయినగర్‌లో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య ఆధ్వర్యంలో గాంధీ జయంతి ఘనంగా జరిపారు. అలాగే వీరవల్లిపాలెం, ముక్తేశ్వరం, నల్లచెరువు, అయినవిల్లి గ్రామాల్లో గాంధీ జయంతిని నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేసి దేశ పటిష్టతను మరింత ఇనుమడింప చేయాలని ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. చింతలూరులో ఆర్యవైశ్య నాయకుల నేతృత్వంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి.

ప్రజా సంక్షేమమే పరమావధి

రాజోలు: ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం పొన్నమండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి రావాలని టోకెన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే సదుద్దేశంతో సీఎం జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సర్పంచ్ కుక్కల బేబికుమారి, మాజీ ఎంపీపీ చేకూరి సింగరాజు, సొసైటీ చైర్మన్ కడలి సత్యనారాయణ, నాయకులు చెల్లింగి రాజబాబు, గెద్దం బుల్లిబ్బాయి, కుక్కల శ్రీను, రాపాక శ్రీను, గుబ్బల సత్తిబాబు పాల్గొన్నారు.


పొన్నమండలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


సఖినేటిపల్లిలో సత్కారాలు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు

సఖినేటిపల్లి: ఈ ఏడాది టీచర్స్ డే పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పరంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారిని సోమవారం స్థానిక పంచాయతీ వద్ద గాంధీ జయంతి సందర్భంగా సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు సత్కరించారు. ప్రభుత్వంచే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన ఎం.నిర్మలకుమారి, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు చేతుల మీదుగా బుద్ధ విహార్ నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఐ.మేరీకుమారి, మన్నే సత్యనారాయణ, కె.రామ సత్యనారాయణలను సన్మానించారు. ఎంఈవో-1, 2 దొండపాటి కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు ఎన్.సత్యనారాయణ, కె.వీరాస్వామి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి విశ్వనాథం, టీచర్స్ సంఘ నాయకులు దీపాటి సురేష్‌బాబు, నాయుడు నాగేశ్వరరావు, ఉండపల్లి బాలాజీ, చింతా వినోద్ కుమార్, కె.బాలకృష్ణ, స్థానికులు ఏఎస్ఎన్ రాజు, నల్లి ప్రేమానందం పాల్గొన్నారు.

రోశయ్య సేవలు చిరస్మరణీయం


కొత్తపేటలో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ నాయకులు

కొత్తపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి), రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సభ్యుడు నంబూరి రెడ్డియ్య అన్నారు. గాంధీ జయంతిని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకల్లో ముందుగా జాతీయ పతాకాన్ని సంఘ అధ్యక్షుడు కోట్ల ప్రభాకరవిశ్వేశ్వరరావు, వాసవీమాత పతాకాన్ని వాసవీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పి.కృష్ణారావు ఆవిష్కరించారు. మాజీ సీఎం, గవర్నర్ రోశయ్య విగ్రహాన్ని జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి ఆవిష్కరించారు. అనంతరం యువజన సంఘం అధ్యక్షుడు అత్యం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర సభ్యుడు నంబూరి రెడ్డియ్య ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. నియోజకవర్గంలో ఉత్తమ విద్యార్థులకు వాసవీ మెరిట్ అవార్డులు ప్రదానం చేశారు. 155 మంది దివ్యాంగులకు దుస్తులు, స్టీలు పాత్రలు పంపిణీ చేశారు. సంఘ సలహాదారు ఎస్ఎన్‌యూకే లింగేశ్వర రావు నిర్వహణలో జరిగిన ఈ సభలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యవరపు జమీందార్ తదితరులు పాల్గొన్నారు.

4న తపాలా ఉద్యోగుల ఒక్క రోజు సమ్మె

సఖినేటిపల్లి: తమ కోర్కెల సాధన కోసం ఈ నెల 4వ తేదీన ఒక్క రోజు సమ్మెకు వెళుతున్నట్టు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం సబ్ డివిజన్ అధ్యక్షుడు కేజే ఇమ్మానియేలు రాజు, ఉపాధ్యక్షురాలు ఎస్‌బీయా బేగం అన్నారు. సోమవారం మలికిపురం పోస్టుఆఫీస్ వద్ద ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో మలికిపురం ఎస్‌వో పరిధిలోని సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నట్టు వారు చెప్పారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల కేంద్ర, రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాలు కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జీడీఎస్ ఉద్యోగులకు ఆరోగ్య బీమా కల్పించాలని వంటి తదితర డిమాండ్ల కోసం ఈ సమ్మెకు వెళుతున్నామన్నారు. సమావేశంలో ఉద్యోగులు పెద్దిరాజు, కృష్ణ, ఝాన్సీలక్ష్మి, మౌనిక పాల్గొన్నారు.


మలికిపురం పోస్టు ఆఫీస్ కార్యాలయం వద్ద సమావేశంలో పాల్గొన్న ఇమ్మానియేలు రాజు, బేగం

పారిశుధ్య కార్మికులకు సత్కారం

కొత్తపేట: గ్రామాల స్వచ్ఛతలో పౌరుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వచ్ఛతా హి సేవలో భాగంగా, గాంధీ జయంతి పురస్కరించుకుని సోమవారం గంటి గ్రామంలో సర్పంచ్ బంగార్రాజు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సచివాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు వీధులు, ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్దనరావు, పీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


గంటిలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ బంగార్రాజు

కవులకు పురస్కారాలు


విజయవాడలో లక్ష్మీపార్వతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భీమారావు


విజయవాడలో విజయ్‌బాబు, శ్రీనివాసరావు నుంచి సత్కారం అందుకుంటున్న ప్రతాప్

సఖినేటిపల్లి/కొత్తపేట: ఎన్టీఆర్ కృష్ణా జిల్లా విజయవాడ ఐలాపురం ఫంక్షన్ హాలులో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా డాక్టర్ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం గ్రహీత డాక్టర్ ప్రతాప్‌ను ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరావు సత్కరించి, మెమెంటో బహూకరించారు. అలాగే కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి, శ్రీశ్రీ కళావేదిక సోషల్ యాక్టివిస్ట్ మెంబర్ జినిపే భీమారావుకు విజయవాడకు చెందిన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వారు మహాత్మా గాంధీ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం చేశారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం


అంతర్వేదికరలో సురేంద్రకు సాయం చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: మండలంలోనే వేర్వేరు గ్రామాల్లో ముగ్గురు బాధితులకు రూ.30 వేలు ఆర్థిక సాయం జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ సోమవారం అందజేశారు. గొందికి చెందిన ఎన్నారై, ఇజ్రాయేల్ నివాసి దొండపాటి సన్, తన మిత్రులతో కలిసి పై మొత్తాన్ని సమకూర్చారు.

ఈ మేరకు ఈ మొత్తంలో గొందిలో అనారోగ్యంతో బాధపడుతున్న దొండపాటి ఎలిజబెత్‌కు రూ.15 వేలు, అంతర్వేదికరలో అంగవైకల్యంతో బాధపడుతున్న చొప్పల సురేంద్రకు రూ.10 వేలు, రామేశ్వరంలో రోడ్డు ప్రమాద బాధితుడు చెల్లుబోయిన జస్వంత్‌కు రూ.5 వేలను జెడ్పీటీసీ అన్నపూర్ణ అందజేశారు. దొండపాటి జాన్సన్, నవీన్ వర్మ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దాతలకు గ్రామస్తులు, బాధితులు అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలోని రైల్వే పనుల కోసం ఏర్పాటు చేసిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక లోడు ట్రాక్టర్, రెండు ఖాళీ ట్రాక్టర్లను స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు సోమవారం సీజ్ చేశారు. ఈ ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం స్థానిక తహసీల్దార్‌కు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఆర్డీవో వసంతరాయుడు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం అమలాపురం ఆర్డీవో ఎస్.వసంతరాయుడు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరాలయం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం సంకష్టహర చతుర్థి సందర్భంగా సోమవారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి స్వామివారి విశేషాభిషేకాలు, పూజలు జరిపారు. స్వామిని ఆలయ ప్రాంగణంలో మూషిక వాహనంపై ఉంచి ఊరేగించారు. అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అయినవిల్లి వాస్తవ్యులు కర్రి నాగరామలోవ ఉదయసాయి గణేష్ కుటుంబ సభ్యులు సోమవారం రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సొమ్ము ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతకు స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

రాజోలు: విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రాజోలు సెంటరులో ఉన్న గాంధీజీ విగ్రహానికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జేఏసీ నాయకులు ఎ.కృష్ణ, మేహది, పి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బి.రాజుబాబులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శౌర్య జాగరణ యాత్ర

ఆత్రేయపురం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్వామీజీ ఆత్మానంద మండలంలోని రాజవరం, పేరవరం, ఉచ్చిలి, ఆత్రేయపురం గ్రామాల్లో శౌర్య జాగరణ యాత్ర ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు చేకూరి రమేష్‌వర్మ, అనంత్, వెంకట్, సత్యనారయణ, సుబ్రహ్మణ్యం, రాంబాబు ప్రచారాన్ని ముందుకు తరలిస్తున్నారు. ప్రతి చోట యాత్రను ఉద్దేశించి శివరామకృష్ణ ఆశ్రమం ఆత్మానంద స్వామి ప్రసంగంతో భక్తులకు శుభాశీస్సులు అందించారు. ఈనెల 1నుంచి 14 వరకు నిరంతరం ప్రతి గ్రామంలో జిల్లా అంతా ప్రచారం చేస్తామన్నారు. అనంతరం యాత్రలో అధిక సంఖ్యలో విశ్వహిందూ పరిషత్, భజరంగళ్ కార్యకర్తలు పాల్గొనగా స్వామిజీ విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

విజయమే లక్ష్యంగా గ్రామ కమిటీలు

రాజోలు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గ్రామ కమిటీలు ఎంపిక చేపట్టామని మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రమైన రాజోలు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. రాజోలు గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొప్పాడి దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా మండా శ్రీను, ప్రధాన కార్యదర్శిగా బొడ్డపల్లి ప్రసాద్, కార్యదర్శిగా గొల్లపల్లి వరప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రాయవలస దుర్గాప్రసాద్, కాట్రు శ్రీనివాస్ (స్టార్ శ్రీను), కార్యవర్గ సభ్యులుగా హరిదాసు సత్యనారాయణమూర్తి, షేక్ షాహుద్దీన్, చిట్టూరి అప్పారావు, యర్రంశెట్టి కామరాజు, కడలి చిట్టిబాబు ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, నాయకులు దార్ల పెదబాబు, మట్టా ఏడుకొండలు, బందారు కాశీ, అడబాల జానకీరామ్, కొత్తపల్లి సాయి, తెన్నేటి త్రిమూర్తులు తదితరులు అభినందించారు.

నేడు పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

అంబాజీపేట/ఆలమూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును అంబాజీపేట మండలం పసుపల్లిలో, ఆలమూరు మండలం చెముడులంకల్లో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు తెలిపారు. ఏర్పాట్లపై వీఆర్వోలకు సూచనలు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న మెగా మెడికల్ క్యాంపునకు 14 రకాల రోగాలకు వైద్యులతో పాటు, గర్భిణులకు, చిన్నపిల్లలకు, కంటికి సంబంధించిన వైద్యులు వస్తున్నారని ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి చవితి మహోత్సవాల సందర్భంగా లభించిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. హుండీ ఆదాయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కిస్తామన్నారు.

కిడ్నీ బాధితుడికి చేయూత

అయినవిల్లి: మండలంలో తొత్తరమూడి కె.పెదలంకలో కిడ్నీ బాధితుడికి జనసేన నాయకులు సోమవారం చేయూత నందించారు. కె.పెదలంకకు చెందిన జల్లి నాగరాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్స నిమిత్తం జనసేన పార్టీకి చెందిన గిడ్డి సత్యనారాయణ రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మద్దా చంటిబాబు తదితరులు ఉన్నారు.